క్లుప్తంగా

తెనాలి తహసీల్దారుగా గోపాలకృష్ణ



తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్‌గా కేవీ గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఆయన్ను తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. చేబ్రోలు తహసీల్దార్‌గా పని చేస్తున్న గోపాలకృష్ణ ఎన్నికల బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట వెళ్లారు. ప్రస్తుతం జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన తెనాలికి రానున్నారు. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

వృద్ధులు, పేదలకు అన్నదానం



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన రాష్ట్ర ఇమానె మజ్లిస్ యువజన కమిటీ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. నరేంద్రదేవ్ కాలనీలోని పేదలకు ఆహారం అందించారు. షేక్ తాజ్ బాషా, షేక్ బాషా, షేక్ బుజ్జి, ధనాల రాఘవేంద్రరావు పాల్గొన్నారు. అలానే వెంకటేశ్వర యోగ సేవాకేంద్రానికి చెందిన కన్నెగంటి పిచ్చియ్య, సుశీలదేవి, నరేంద్రకుమార్, కీర్తి కుటుంబసభ్యుల సహకారంతో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాలయాల్లో వృద్ధులకు అన్నదానం చేశారు. సరయు, శ్రేయస్, వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం




తెనాలిరూరల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు యోగ గురువు కేఎన్‌కే కిషోర్ గురూజీ ఆర్థిక సాయం అందించారు. పొన్నూరుకు చెందిన శైలజ కిడ్నీ సమస్యతో తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న కిషోర్ గురూజీ ఆదివారం వైద్యశాలకు వెళ్లి రూ.4,816లను బాధిత మహిళకు అందజేశారు. అలానే అహ్మదాబాద్‌లో ఉంటున్న విక్రమ్ సహకారంతో వార్డులోని రోగులకు బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

పిల్లలకు వైద్య పరీక్షలు



తెనాలి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పిల్లల ఉచిత వైద్య శిబిరం జరిగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెనాలి ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు తెలిపారు. గత 19 ఏళ్లగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో చిన్నారులకు వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కుప్పా రాజశేఖర్ అన్నారు. ఆహార, ఎదుగుదల లోపాలు కారణంగా చిన్నారులు గుండె జబ్బులకు గురవుతారని ప్రముఖ చిన్న పిల్లల గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పి.రఘురామ్ అన్నారు. డాక్టర్ కుప్పా రాధిక రాజశేఖర్, డాక్టర్ గారపాటి అఖిల్, డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు 200 మంది చిన్నారులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మాలేపాటి తిరుమలేశ్వరరావు, వి.శివ సుధాకర్, ఎం.హేమంత్ కుమార్, బి.రామ్మోహన రావు, జి రామకోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎం పూర్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి రోగులకు ఉచితంగా పరీక్షలు



తెనాలి: డీ3 శారద సర్వీస్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారద భవనంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్నుంచి ప్రజలు ఉదయం ఆరు గంటలకే తరలివచ్చారు. వీరందరికి పరగడుపున షుగర్, బీపీ పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అల్పాహారం అందించి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు (సంక్రమించని వ్యాధులు)పై డాక్టర్ శారద అవగాహన కల్పించారు. ఆహార, వ్యాయామ నియమాలను పాటిస్తే.. జీవితం ఆరోగ్యవంతంగా సాగుతుందని చెప్పారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

శత వసంతంలోకి టౌన్ చర్చి

- ఇక్కడి మార్టిన్ లూథర్ విగ్రహం ప్రపంచంలోనే రెండోది
- వందేళ్ల ఉత్సవాలకు నిర్మాణాలతో సందడి



మార్టిన్ లూథర్ విగ్రహం



తెనాలిలోని ఏఈఎల్‌సీ చర్చి

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి శతవసంతంలోకి ప్రవేశించింది. వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం చర్చిలో పలు నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు టౌన్‌చర్చిగా పిలుచుకునే ఈ క్రీస్తుదేవాలయం అన్ని హంగులతో కూడిన ప్రార్థనామందిరంగా రూపొందిస్తున్నారు.

క్రైస్తవులు ఏసుక్రీస్తును అవతార పురుషునిగా భావిస్తారు. బైబిలులోని సువార్తలు క్రీస్తు ప్రవక్త బోధనలను తెలియజేస్తాయి. విశ్వజనీనత, పరలోక రాజ్యప్రాప్తి సిద్ధాంతాలను క్రీస్తు బోధించారు. బ్రిటిష్ వారి రాకతో ఏర్పాటైన క్రైస్తవ సమాజాలు మత వ్యాప్తికి తోడ్పడుతూ విద్య, ఆరోగ్య రంగాల్లో ఇతోధిక సేవలను అందించాయి. పవిత్ర జీవనాన్ని పెంపొందించాయి. ఆ విధంగా తెనాలిలో దాదాపు అన్ని మత శాఖలు ప్రసిద్ధి చెందాయి. రోమన్ కాథలిక్, లూథరన్, బాప్టిస్ట్, వర్ల్డ్ మిషనరీ ఇవాంజిలిమ్, రక్షణ సైన్యం, బైబిలు మిషనుతోపాటు మరెన్నో పట్టణంలో కనిపిస్తాయి. స్వతంత్రపరమైన సిద్ధాంతాలు వేర్వేరుగా ఉన్నా, అందరూ ఏసుక్రీస్తును, బైబిలును ఆరాధిస్తారు. మార్టిన్ లూథర్ సిద్ధాంతాలను నమ్మి ఏసుక్రీస్తును అంగీకరించినవారు లూథరన్ క్రిస్టియన్లుగా ప్రపంచవ్యాప్తంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. లూథరన్ చర్చి 1820లో ఏర్పాటై, ప్రపంచ దేశాల్లో మత ప్రచారం ఆరంభించింది.

అందులో భాగంగా నిర్మించిన వివిధ మత శాఖల ప్రార్థనాలయాల్లో ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి ప్రముఖమైంది. పట్టణ బోసు రోడ్డులోని ఈ క్రీస్తు దేవాలయాన్ని టౌన్ చర్చిగా ప్రముఖమైంది. వాస్తవంగా ఈ చర్చి నిర్మాణాన్ని 1922లోనే పూర్తిచేశారని చెబుతారు. అనివార్య కారణాలతో 1925లో ప్రారంభోత్సవం చేశారు.



చర్చి బాధ్యులతో దేవరపల్లి ఏసురత్నం

చర్చి నిర్మాణానికి అవసరమైన కొండరాళ్లను సింగపూర్ నుంచి మచిలీపట్నం ఓడరేవు ద్వారా జలమార్గంలో తెనాలికి తెప్పించారు. రంగూన్ నుంచి రప్పించిన మేలురకం టేకు కర్రతో ఇక్కడి దర్వాజాలు, కిటికీలు చేయించారు. ఆర్కిటెక్ట్ పరిజ్ఞానంతో ఈ క్రీస్తు దేవాలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

బ్రిటిష్ మిషనరీలు రెవరెండ్ జీఆర్ హోప్ 1914–25 వరకు, రెవరెండ్ డాక్టర్ విక్టర్ మెకాలే దంపతులు 1928–34 వరకు, రెవరెండ్ డుంకుల్ బర్గర్ 1935–39 వరకు, మళ్లీ 1945–50 వరకు తెనాలిలో సేవలందించారు. అప్పట్లో రేపల్లె కూడా తెనాలి డివిజను పరిధిలో ఉండేది. 1923లో రెవరెండ్ జీఆర్ హోప్, రేపల్లెను ప్రత్యేక జోనుగా చేశారు. రెవరెండ్ హారిని తొలి మిషనరీగా నియమించారు. ఏఈఎల్‌సీ అధ్యక్షుడిగా కాకి నతానియేల్ ఉన్నపుడు 1990లో టౌన్‌చర్చిని ఆధునీకరించారు. చర్చి ఆవరణలో సంస్కరణ వేత్త, క్రైస్తవ మత ప్రచారకుడు మార్టిన్ లూథర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ విగ్రహం ప్రపంచంలోనే రెండోదిగా ఆవిష్కారమైనట్టు చెబుతారు. దీనికి ముందు కళాకారుడు పాల్ ప్రభాకర్ ఏసుక్రీస్తు పెయింటింగ్‌ను చిత్రీకరించారు. ప్రతి ఆదివారం ప్రార్థనలతోపాటు, క్రైస్తవ పండుగలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తుంటారు. క్రిస్మస్ పండగకు విద్యుత్ అలంకరణ, రంగురంగుల క్రిస్మస్ స్టార్లతో చర్చిని అలంకరిస్తారు. క్రైస్తవ సోదరులతోపాటు హిందువులూ ఈ చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటూ ఉంటారు. 2018–19లో చర్చికి అవసరమైన మరమ్మతులు చేసి, మరింత శోభను తీసుకొచ్చారు.

ఏ క్లాస్ ప్యారీష్‌గా వ్యవహరిస్తున్న ఈ క్రీస్తు లూథరన్ దేవాలయానికి ప్రధాన గురుమండల అధికారిగా దేవరపల్లి ఏసురత్నం ఉన్నారు. ఆరిషన్ పాస్టర్‌గా యిమర్తి లెనిన్‌బాబు, అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా ఐనంపూడి డేవిడ్‌రాజు, గురిందపల్లి వేమయ్య, చల్లపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, బడుగు బుజ్జిబాబు, సుదర్శనం జాన్‌మోహన్, గ్లోరి దేవదానం, కారుమంచి చంద్రకుమార్, గారపాటి శ్యాం ప్రకాశరావు, కన్వీనర్‌గా పిల్లి విద్యాసాగర్ వ్యవహరిస్తున్నారు.

రానున్న వందేళ్ల ఉత్సవాల సందర్భంగా రూ.75 లక్షలతో సండే స్కూలు, మీటింగ్ హాలు, స్త్రీల సమాజం నిర్మించారు. చర్చికి ఇరువైపులా రూఫ్‌ను పక్కాగా ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఫ్లోరింగ్, ప్రధాన గేటును ఆధునికరిస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న శత వసంత ఉత్సవాలకు సన్నాహకంగా ఈ నిర్మాణపనులను చేపట్టారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి



మంత్రి నారా లోకేష్‌తో సతీష్

తెనాలి: సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్, పరిశ్రమల మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్లు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామ/ వార్డ్ సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండికళ్ల సతీష్ ఆదివారం తెలిపారు. సచివాలయాల ఉద్యోగులందరికీ శాఖాపరమైన పదోన్నతులు, అన్నిరకాల బదిలీలకు త్వరితగతిన అవకాశం కల్పించాలనీ, అయిదేళ్లు పూర్తయిన ఉద్యోగులందరికీ రూ.29 వేల బేసిక్ పే స్కేలు అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా సచివాలయాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీన్ చానల్ ను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఫీల్డ్ వర్కర్లకు టీఏ, డీఏలు అమలుపరచాలని, ప్రతి మండలం, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ జిల్లా రెవెన్యూ డివిజన్, రాష్ట్ర స్థాయిలో నోడల్ వ్యవస్థను ఏర్పాటు, జాబ్ చార్ట్ అమలు అయ్యేలా చూసి పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ప్రతి ఉద్యోగికి నోషనల్ ఇంక్రిమెంట్, ఆరియర్స్ ను క్లియర్ వంటి సమస్యలపై వినతిపత్రం అందించినట్లు వివరించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శామ్యూల్, రాష్ట్ర అధ్యక్షుడు జోసెఫ్ కిషోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్యలక్ష్మి గుజ్జల పాల్గొన్నట్లు వివరించారు.

భూమి పరిరక్షణ అందరి కర్తవ్యం



ప్రకృతికి వాటిల్లుతున్న నష్టంపై ఛాయా చిత్రాన్ని ప్రదర్శిస్తున్న వరప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వంలో మానవజాతి మనుగడకు అనువుగా ఉన్న ఏకైక గ్రహమైన భూమిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర పన్నుల శాఖ విశ్రాంత సూపరింటెండెంట్, ప్రకృతి ఛాయాచిత్రకారుడు డాక్టర్ టి.ఎన్. వరప్రసాద్ పేర్కొన్నారు. యువజన సర్వీసులశాఖ – స్టెప్, స్వశక్తి ఆధ్వర్యంలో ఆదివారం జేకేసీ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామిక, హరిత విప్లవం ద్వారా ప్రకృతికి జరిగిన నష్టాన్ని వివరించారు. పెరుగుతున్న పారిశ్రామీకరణ, పట్టణీకరణ ప్రభావం ప్రకృతి వనరులపై పడి, సహజ వనరులతో పాటు పచ్చదనం తరిగి పోతున్నాయని తెలిపారు. ప్రకృతి పరిరక్షణకు యువతరం నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త డి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సమస్త విశ్వంలోని సర్వజీవులు జీవించేందుకు కావాల్సిన సమతుల్యత లోపించిన కారణంగా మానవజాతి మనుగడకే ముప్పు ఏర్పడిన నేపథ్యంలో బయోస్పియర్ ప్రాధాన్యత, దాని లోటును భర్తీ చేసేందుకు యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. స్టెప్ మేనేజర్ బి. రాధిక మాట్లాడుతూ మన రాష్ట్రంలో 18 శాతంగా ఉన్న అటవీ విస్తీర్ణాన్ని జాతీయ అటవీ విధానానికి అనుగుణంగా 33 శాతానికి పెంచేందుకు యువతరం ముందుకు రావాలని కోరారు. అనంతరం ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి. రాహుల్, కె. చరణ్‌చౌదరి, ఎల్. అజయ్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

లక్ష్మీపురం: దేశంలో పేదల సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాల్ని జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. స్థానిక నందివెలుగు రోడ్డులోని సివిల్ సప్లయిస్ గొడౌన్స్‌లో సీపీఐ నగర సమావేశాన్ని కార్యదర్శి కోట్ల మరియదాసు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను నిలదీస్తూ పేదల పక్షాన సీపీఐ అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. దున్నే వారికే భూమి ఇప్పించిందని తెలిపారు. భూమిలేని ప్రజల కోసం పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు. ఇళ్లు లేని ప్రజలకు స్థలాలు ఇప్పించడంలో పార్టీ ప్రభుత్వాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. డిసెంబర్ 26న సీపీఐ 100 సంవత్సరాల్లోకి అడుగు పెడుతున్న సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవాల్ని అత్యంత భారీస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేద, బడుగు, బలహీన కార్మిక వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్నా, నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, వినుకొండ డేవిడ్, కాంతారావు, జాన్ బాబు, సురేష్, చిలక నాగరాజు, దానం, జక్రయ్య, కోటేష్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

నేడు బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 24వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరుగుతుందని బీటీఏ రాష్ట్ర కార్యదర్శులు బట్టు వెంకయ్య, జి.వేమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ వేడుకల్లో భారత ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటిస్తామని తెలిపారు. బీటీఏ లక్ష్యాలు, సాధించాల్సిన సమస్యలపై చర్చ జరుగుతుందని, ఇదే వేదికపై బీటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రమణయ్యను సత్కరిస్తామని వివరించారు.

ఉపాధ్యాయుల వేతనాల్లో టీడీఎస్ మినహాయించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్, అర్బన్ మండలాల ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించి మొదటి, రెండవ క్వార్టర్‌లను టీడీఎస్ చేయకుండా ఉపాధ్యాయుల్ని ఎంఈవోలు ఆందోళనకు గురి చేస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్య, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డి.కె. సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీఎస్ డిడక్షన్ ఈనెల 31లోపు పూర్తి చేసి, ఈ–ఫైలింగ్ పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే ముందస్తుగా టాక్స్ చెల్లించిన ఉపాధ్యాయుల టీడీఎస్ పూర్తి చేయకపోతే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల వేతనం నుంచి మినహాయించిన మొత్తం ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఈ–ఫైలింగ్ చేసేందుకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. గుంటూరు రూరల్, అర్బన్ మండలాల పరిధిలోని ఎంఈవోలు తక్షణమే ఆడిటర్‌తో టీడీఎస్ పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు ఇతర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరిస్తామని ఇన్‌చార్జి కమిషనర్ శ్యాంసుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వాసవీ మాతకు సారె సమర్పణ



నగరంపాలెం: స్థానిక ఏటుకూరు రోడ్డు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్, వాసవీ జాగృతి క్లబ్ గర్తపురి సంయుక్తంగా వాసవీ అమ్మవారికి సారే మనసారా కార్యక్రమం నిర్వహించారు. వాసవీ మాతకు పసుపు కుంకుమ, చీర, పుష్పాలను భక్తితో సమర్పించారు. కార్యక్రమంలో యేలూరి హాస్పిటల్స్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మానస, వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ మాస్టర్ కార్డ్ ఇన్‌చార్జి రంగా రత్నశ్రీ, వనిత జాగృతి క్లబ్ గర్తపురి బృందం రంగా చంద్రశేఖర్, మద్ది రాకేష్, వాసవి పాల్గొన్నారు.

సమాజంలో మానవత్వం పెంచడమే లక్ష్యం

మానవత సర్వ సభ్య సమావేశంలో చైర్మన్ డాక్టర్ కె.రామ్‌చంద్



మృదంగ విద్వాంసుడు కేవీ రామకృష్ణకు సత్కారం



ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్థిక సాయం

తెనాలి: సమాజంలో మానవత్వం పెంపొందేలా చేయటమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అన్నారు. దీనితోపాటు కష్టాల్లో ఉన్నవారి కన్నీరు తుడవటం, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, విద్య, వైద్యం, పర్యావరణ సేవల నిర్వహణ ఆశయాలతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. మానవత సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో జరిగింది. అధ్యక్షత వహించిన డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ తెనాలి శాఖ ఆరంభించిన ఏడాదిలోనే, సమావేశాలకు హాజరవుతున్న సంభ్యుల సంఖ్య, వయోవృద్ధులకు ఆత్మీయ పలకరింపు అనే అంశాలు రాష్ట్ర శాఖ ప్రశంసలకు నోచుకున్నాయని గుర్తుచేశారు. సాధ్యమైనంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చుకోవాల్సి ఉందన్నారు. సమాజ సేవాభిలాషులు మానవతతో చేరి, సంస్థ ఆశయసాధనలో భాగస్వాములు కావాలని కోరారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు కటకం వెంకట ప్రసాద్, కార్యదర్శి పోపుల వెంకట్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను వివరించారు. సభ్యత్వ నమోదు జరుగుతున్నందున అందరూ రెన్యువల్ చేసుకుని కొత్త సభ్యుల చేరికను ప్రోత్సహించాలని కోరారు. పట్టణానికి చెందిన ఏ–గ్రేడ్ మృదంగ విద్వాంసుడు కేవీ రామకృష్ణను సమావేశంలో సత్కరించారు. స్వచ్ఛంద సేవాసంస్థలు కళాకారులను ఆదరించి, సత్కరించటం అరుదైన విషయమని, ఈ గౌరవం తనకు దక్కటం సంతోషంగా ఉందని రామకృష్ణ అన్నారు. పిల్లలమర్రి శ్రీనివాసరావు కుమార్తె వివాహం నిమిత్తం విజ్ఞాన్ విద్యాసంస్థల అధిపతి డాక్టర్ లావు రత్తయ్య సమకూర్చిన రూ.20 వేలు, మానవత సాయం రూ.10 వేలు కలిపి మొత్తం రూ.30 వేల నగదును సమావేశంలో అందజేశారు. కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థిని హిమబిందు హాస్టల్ ఖర్చుల నిమిత్తం సంస్థ కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, వారి మిత్రులు సమకూర్చిన రూ.25 వేల చెక్కును అందజేశారు. సమావేశంలో కేవీ రామకృష్ణ మృదంగ లయ విన్యాసం సభ్యుల కరతాళధ్వనులను అందుకుంది. గౌరవ సలహాదారులు మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పరిమి శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కళ్యాణి, ముత్తేవి రవీంద్రనాథ్, చిట్టినేని సాంబశివరావు, ఎం.అర్జున, అయినాల మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎం.ధనుంజయరావు, వి.ఫణీంద్ర, పి.మల్లిఖార్జునరావు, యడవల్లి రోహిణి, ఎ.లక్ష్మి, కోసూరి మధుసూదనరావు పాల్గొన్నారు.

వ్యవ'సాయం' తగ్గించటంపై నిరసన

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

తెనాలి: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపులు తగ్గించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం ఎదుట జరిగిన నిరసనలో సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిహార్ రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించి, ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రంగా అన్యాయం చేసిందని మండిపడ్డారు. వివిధ సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లను అప్పుగా ఇస్తామని చెప్పటం అన్యాయమన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నూటికి 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించటం వల్ల యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతాయని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.20 వేల కోట్లను తగ్గించినట్టు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని ఆరోపించారు. కార్మిక, కర్షక ఐక్యతతోనే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోగలమని, రైతాంగాన్ని రక్షించుకోవటం సాధ్యపడుతుదని చెప్పారు. ఆ దిశగా కృషి జరగాల్సి ఉందన్నారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, పి.జోసేష్, చుక్కపల్లి శేషగిరిరావు, మహిళా సంఘం నాయకులు ఎస్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి, చంద్రకళ, ములకా శివకుమారి, ఎం.అనూష పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ కె.మిథునేశ్వర్‌రెడ్డి

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని సంఘ భవనంలో నిర్వహించారు. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ కె.మిథునేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఊపిరితిత్తుల వ్యాధులపై సభ్యులకు అవగాహన కల్పించారు. మత్తు, నొప్పి నివారణ వైద్యురాలు డాక్టర్ ఎంపీ ప్రియాంక వివిధ రకాల నొప్పుల గురించి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా సమావేశానికి ముందు సంఘ సభ్యులకు ఊపిరితిత్తుల సామర్థ్యం పరీక్షలు నిర్వహించారు. కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తి అవసరం



విజేతలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, తహసీల్దారు కేదార్‌నాథ్

లక్ష్మీపురం: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తి అవసరమని, తల్లిదండ్రులు కూడా చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయాలని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.కాశీనాథరెడ్డి తెలిపారు. స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాలలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛాంపియన్ షిప్–2024 పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, పెదనందిపాడు ఎమ్మార్వో కేదార్‌నాథ్ హాజరై ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా నిర్వహించారు. పోటీల్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన క్రీడాకారులు ఆగస్టు 2న అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ రమణ, వలి, సాయి, విజయ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మధురంగా శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సుప్రసిద్ధ గాయకులు జి.అభిరామ బోడె శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. శ్రీ త్యాగరాజస్వామితో పాటు పలు వాగ్గేయకారుల కీర్తనల్ని మధురంగా గానం చేశారు. వయోలిన్‌పై గాయత్రీ విభావరి(చెన్నై) మృదంగంపై పి.ఎస్.ఫల్గున్ (విజయవాడ) చక్కటి వాయి ద్యాన్ని అందించారు. కార్యక్రమాన్నిసంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ నిర్వహించారు. కళాకారుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.